





RNI No. TEL/TEL/2018/76342

# లోకంతీరు

LOKAMTEERU TELUGU DAILY సామాజిక, రాజకీయ దిన పత్రిక

ప్రచురణ : నిజామాబాద్ శనివారం 27-07-2024 ఎడిటర్ : బ్యాగల్ శ్రీనివాస్ సంపుటి : 06 సంచిక : 196 పేజీలు : 4 వెల : రూ 2-00


## కన్నెపల్లిని సందర్శించిన బిఆర్ఎస్ బృందం

కరీంనగర్,జూలై26 బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శన రెండో రోజు కొనసాగుతున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో హైదరాబాద్ నుంచి బయల్దేరిన ప్రజా ప్రతినిధుల బృందం.. గురువారం సాయంత్రం కరీంనగర్‌లో లోయర్ మానేరు రిజర్వాయర్‌ను పరిశీలించిన విషయం తెలిసిందే. శుక్రవారం ఉదయం రామగుండం ఎన్టీపీసీ నుంచి కన్నెపల్లికి బయల్దేరి వెళ్లిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు.. మంచిర్యాల జిల్లా ఇందారం వద్ద నీటి ప్రవాహం లేక ఎండిపోయిన గోదావరి నదిని పరిశీలించారు. అనంతరం కాళేశ్వరం ఆలయానికి చేరుకున్న కేటీఆర్‌కు ఆలయ అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి సన్నిధిలో కేటీఆర్ ప్రత్యేక పూజలు చేశారు. పూజల అనంతరం కన్నెపల్లి పంపు హౌజ్‌కు చేరుని పంప్ హౌస్‌ను పరిశీలించారు.

# సైనికుల త్యాగాలను దేశం మరవదు



- ఉగ్రవాదులను సమూలంగా పెకిలిస్తాం
- కార్గిల్ అమరులకు ప్రధాని మోడీ నివాళి
- పాక్‌కు పరోక్షంగా గట్టి హెచ్చరికలు
- షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణ పనులకు శ్రీకారం

లద్దాఖ్,జూలై2 : దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి పోరాడిన సైనికుల త్యాగాలకు యావత్ భారతావని ఎప్పటికీ రుణపడి ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. కార్గిల్ 25వ విజయ దివస్ ను పురస్కరించుకుని శుక్రవారం ఆయన లద్దాఖ్ వెళ్లారు. ద్రాస్‌లోని యుద్ధ స్మారకాన్ని సందర్శించి అమర జవాన్లకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాకిస్థాన్‌పై విరుచుకు పడ్డారు. ఉగ్రవాదాన్ని సమూలంగా పెకిలిస్తామని దాయాది దేశాన్ని మరోసారి గట్టిగా హెచ్చరించారు. గతంలో పాకిస్థాన్ పాల్పడిన వికృత ప్రయత్నాలు విఫలమయ్యాయి. అయినా, చరిత్ర నుంచి ఆ దేశం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు సరికదా.. ఉగ్రవాదం, ప్రాక్సీ వార్‌తో ఇంకా మనపై కవ్వింపు చర్యలకు పాల్పడుతూనే ఉంది. ఈ రోజు నేను మాట్లాడే మాటలు.. ఉగ్రవాదులను తయారుచేస్తున్న వారికి నేరుగా వినబడతాయి. ముష్కరులను పెంచి పోషిస్తున్న వారికి నేను చెప్పేది ఒక్కటే.. వారి దుర్మార్గపు కుట్రలు ఎన్నటికీ ఫలించవు. మా దళాలు ఉగ్రవాదాన్ని నలిపివేసి.. శత్రువులకు తగిన జవాబిస్తాయి అని మోదీ పాక్‌ను హెచ్చరించారు. కార్గిల్ యుద్ధానికి లద్దాఖ్ సాక్షిగా నిలుస్తుంది. అమరుల త్యాగాలకు గుర్తుగా విజయ్ దివస్ జరుపుకుంటున్నాం. మన బలానికి, సహనానికి, వాస్తవాలకు ఈ విజయగాథ నిదర్శనం. దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన సైనికులు చిరకాలం గుర్తుండిపోతారు. కార్గిల్ యుద్ధ సమయంలో సామాన్యుడిగా సైనికుల మధ్య ఉండే అదృష్టం నాకు దక్కింది. దేశం కోసం వారు చేసిన పోరాటం నా మదిలో నిలిచిపోయింది. లద్దాఖ్, జమ్మూకశ్మీర్ అభివృద్ధి కోసం ఎలాంటి సవాళ్లనైనా భారత్ అధిగమిస్తుంది. మరికొద్ది రోజుల్లో ఆర్టికల్ 370ని రద్దు చేసి ఐదేళ్లు పూర్తవుతాయి. ఇప్పుడు జమ్మూకశ్మీర్ ప్రజలు సరికొత్త భవిష్యత్తు కోసం ఎదురుచూస్తున్నారు. పెద్ద కలల గురించి మాట్లాడుకుంటున్నారు. ప్రస్తుతం కశ్మీర్ ప్రతిష్ఠాత్మక కార్యక్రమాలకు నిలయంగా ఉంది. ఈ భూలోక స్వర్గం శాంతి, సౌభ్రాతృత్వం వైపు వేగంగా పరిగెడుతోందని మోదీ తెలిపారు. అంతకుముందు, యుద్ధ స్మారకం వద్ద కార్గిల్ అమరవీరులకు ప్రధాని నివాళులర్పించారు. వీర జవాన్ల కుటుంబసభ్యులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా షింకున్ లా టన్నెల్ ప్రాజెక్ట్ నిర్మాణపనులను ప్రధాని మోదీ ప్రారంభించారు. టన్నెల్ నిర్మాణ ప్రాంతం వద్ద వర్చువల్‌గా తొలి బ్లాస్ట్ చేశారు. 4.1 కిలోమీటర్ల పొడవైన ఈ ట్విన్ ట్యూబ్ టన్నెల్‌ను 15,800 అడుగుల ఎత్తులో నిర్మించనున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సాయుధ దళాలను వేగంగా తరలించేందుకు, సైనిక సామగ్రిని చేరవేసేందుకు ఈ సొరంగం సమర్థంగా ఉపయోగపడనుంది. దీని నిర్మాణం పూర్తయితే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన సొరంగంగా గుర్తింపు సాధించనుంది.పొరుగు దేశం పాకిస్థాన్‌కు ప్రధాని మోదీ వార్నింగ్ ఇచ్చారు. 25వ



కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా ద్రాస్ సెక్టార్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. పాకిస్థాన్ నేరాలకు పాల్పడి గతంలో విఫలం అయ్యిందని, కానీ ఆ చరిత్ర నుంచి ఆ దేశం ఏమీ నేర్చుకోలేదని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, ప్రచ్ఛన్న యుద్ధంతోనే ఆ దేశం జీవనం చేస్తోందని విమర్శించారు. తాను మాట్లాడే ప్రదేశం నుంచి ఉగ్రదాదులకు పాల్పడుతున్న ముఠా నేతలు తన స్వరాన్ని నేరుగా వింటారని, ఉగ్రవాదానికి ఊతం ఇస్తున్న దేశాలకు ఓ విషయాన్ని చెప్పదలుచుకున్నానని, ఆ దేశ కుంచిత ఆలోచనలు ఎన్నటికీ విజయవంతం కావు అని ప్రధాని తెలిపారు. పూర్తి స్థాయి దళాలతో ఉగ్రవాదుల్ని మా సైనికులు అణిచివేస్తారని, శత్రువుకు బలమైన సమాధానం ఇస్తామని ప్రధాని మోదీ పేర్కొన్నారు. లడాఖ్ అయినా, జమ్మూకశ్మీర్ అయినా, అభివృద్ధికి అడ్డు వచ్చే ఎటువంటి సవాల్‌ను అయినా ఇండియా ఓడిస్తుందని మోదీ అన్నారు. ఆర్టికల్ 370ని రద్దు చేసి ఆగస్టు 5వ తేదీ నాటికి అయిదేళ్లు అవుతుందని, జమ్మూకశ్మీర్ ప్రజలు కొత్త భవిష్యత్తు, కొత్త కలల గురించి మాట్లాడుకుం టున్నారని తెలిపారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, పర్యాటక రంగం.. లడాఖ్, జేకేలో వేగంగా వృద్ధి చెందుతోందన్నారు. కశ్మీర్‌లో కొన్ని దశాబ్దాల తర్వాత సినిమా హాల్‌ను ఓపెన్ చేసినట్లు చెప్పారు. 35 ఏళ్ల తర్వాత శ్రీనగర్‌లో తాజియా ఊరేగింపు జరిగిందన్నారు.

## వ్యవస్థలను నిర్వీర్యం చేశారు : కాషాయ పాలకులపై అఖిలేష్ యాదవ్ ఫైర్

న్యూఢిల్లీ: యూపీ మాజీ సీఎం, ఎస్పీ చీఫ్ అఖిలేష్ యాదవ్ కాషాయ పాలకులు లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతలు ప్రతి వ్యవస్థనూ నిర్వీర్యం చేశారని, ప్రతి విభాగాన్నీ ధ్వంసం చేశారని ఆరోపించారు. ఢిల్లీ వైఫీకి యూపీ డిప్యూటీ సీఎం కేశవ్ ప్రసాద్ మౌర్య పాస్‌వర్డ్‌లా వ్యవహరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాన్ని ఇలాగేనా నడిపేదని ఆయన ప్రశ్నించారు. యూపీని ఇలా పాలించరాదని పేర్కొన్నారు. కాషాయ పాలకులు యూపీ ప్రజలను మోసగిస్తున్నారని మండిపడ్డారు.ఎస్పీ ప్రజలకు జవాబుదారీగా ఉంటుందని, తమ పార్టీ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని అఖిలేష్ యాదవ్ స్పష్టం చేశారు.మరోవైపు కేంద్ర బడ్జెట్‌పై టీఎంసీ ఎంపీ శత్రుఘ్న సిన్హా తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు.కేంద్ర బడ్జెట్‌లో ఎన్డీయే భాగస్వామ్య పక్షాలను సంతృప్తి పరిచేందుకు పలు నిర్ణయాలు తీసుకున్నారని, తెలంగాణ, పంజాబ్, హరియాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్ వంటి పలు రాష్ట్రాలను విస్మరించారని మండిపడ్డారు.బెంగాల్‌కు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, ఇది కేవలం కుర్చీని కాపాడుకునే బడ్జెట్ మాత్రమేనని దుయ్యబట్టారు.అగ్నివీర్ పథకంపై ప్రధాని మోదీ ప్రకటనను ప్రస్తావిస్తూ ఇది యువతకు వారి కుటుంబాలకు ఎలాంటి మేలు చేసే పథకం కాదని విమర్శించారు. ఇక దేశంలో అత్యంత ప్రముఖ నేతల్లో మమతా బెనర్జీ ఒకరని అనడంలో ఎలాంటి సందేహం లేదని శత్రుఘ్న సిన్హా పేర్కొన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో మమతా బెనర్జీ తన గళాన్ని గట్టిగా వినిపిస్తారని చెప్పారు.



## నీతి ఆయోగ్ సమావేశ బహిష్కరణ

**ఆనాడు కెసిఆర్ బహిష్కరిస్తే విమర్శలు**
**కాంగ్రెస్ పార్టీది ద్వంద్వ వైఖరన్న కెటిఆర్**



హైదరాబాద్,జూలై26 (ఆర్ఎన్ఎ): నీతి అయోగ్ సమావేశ బహిష్కరణపై కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ద్వంద్వ వైఖరిని కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ పట్ల కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగా ప్రధాని మోదీతో సమావేశాన్ని నాడు కేసీఆర్ బాయ్‌కాట్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తప్పుపట్టిందని, ఇరువురు కుమ్మక్కయ్యారని ఆరోపించిందని చెప్పారు. మరి ఇప్పుడు నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నాని రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించడంపై కాంగ్రెస్ ఏం చెబుతుందని ప్రశ్నించారు. ప్రధాని మోదీని చోటే భాయ్ ఎందుకు కలవానుకోవడం లేదు?, కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై ఎందుకు మాట్లాడాలని ఎందుకు అనుకోవడం లేదని ఎక్స్ వేదికగా నిలదీశారు. తెలంగాణ పట్ల కేంద్రం అనుసరిస్తున్న పక్షపాత వైఖరికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు అప్పట్లో సీఎం కేసీఆర్ ప్రకటిస్తే పీసీసీ అధ్యక్షునిగా ఉన్న ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తప్పుపట్టారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రధానిని నిలదీయడానికి నీతి అయోగ్ సమావేశం ఒక మంచి అవకాశమని వాదించారు. ఆ సమావేశానికి సీఎం కేసీఆర్ వెళ్లాలని డిమాండ్ చేశారు. అదే రేవంత్‌రెడ్డి ఇప్పుడు సీఎంగా కేంద్ర బ్జడెట్‌లో తెలంగాణకు జరిగిన అన్యాయానికి నిరసనగా నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు బుధవారం శాసనసభలో ప్రకటించిన విషయం తెలిసిందే. నీతి అయోగ్ సిఫారసులకు కేంద్రం విలువ ఇవ్వనప్పుడు ఆ సమావేశానికి వెళ్లడంలో అర్థం లేదనే బహిష్కరిస్తున్నట్టు రెండేండ్ల కిందట సీఎం కేసీఆర్ ప్రకటించారు. మిషన్ కాకతీయకు రూ.5 వేల కోట్ల గ్రాంట్, మిషన్ భగీరథకు రూ.19,500 కోట్ల గ్రాంట్ తెలంగాణకు ఇవ్వాలని నీతి అయోగ్ చేసిన సిఫారసును కేంద్రం పట్టించుకోకపోవడంతో.. నిరసనగా నీతిఆయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్టు కేసీఆర్ వివరించారు. కేంద్రం వైఖరిని తప్పు పట్టాల్సింది పోయి అప్పుడు పీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవం త్‌రెడ్డి సీఎం కేసీఆర్ నిర్ణయాన్నే తప్పుపట్టారు.

## పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలి

### కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు రెంజల్ మండలంలో ఆకస్మిక తనిఖీలు








నిజామాబాద్, జూలై 26 (లోకంతీరు): వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలేందుకు ఎక్కువ ఆస్కారం ఉన్నందున పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ఆయా ప్రభుత్వ బడులలో కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. రెంజల్ మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం సందర్శించారు. ఎంపీడీఓ కార్యాలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా పీ.హెచ్.సీతో పాటు ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ఆవరణలో విద్యార్థిని విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ముందుగా వీరన్నగుట్టతండాలోని జిల్లా పరిషత్ హైస్కూల్, తెలుగు, ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలను కలెక్టర్ పరిశీలించారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం, నీరు వృధా అవుతుండడాన్ని గమనించి అధికారులపై ఒకింత అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే పారిశుధ్య పనులు జరిపించి, అపరిశుభ్రతను పారద్రోలాలని ఎంపిడిఓ, ఎంపీఓలను ఆదేశించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పాఠశాల చుట్టూ ప్రహారీగోడ నిర్మించాలని, వృధా నీటిని భూమిలో ఇంకించేందుకు వీలుగా ఇంకుడుగుంత ఏర్పాటు చేయాలని సూచించారు. రెంజల్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను సైతం సందర్శించి, మౌలిక సదుపాయాలు పెంపొందించేందుకు వీలుగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను పరిశీలించారు. వంట గది, వరండా, అదనపు గదులు, వాటర్ సంప్, టాయిలెట్స్ తదితర నిర్మాణాలు, మరమ్మతు పనులను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీరు సరఫరా జరుగుతోందా, వాటర్ సప్లై కనెక్షన్ ఉందా? అని ఆరా తీశారు. వివిధ దశల్లో కొనసాగుతున్న పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని, పనులు పూర్తయిన వాటికి ఎం.బీ రికార్డులు చేసి నివేదికలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి, అందుబాటులో ఉన్న సదుపాయాలను పరిశీలించారు. పాఠశాలలతో పాటు, పీ.హెచ్.సీ పరిసరాలు సైతం పిచ్చి మొక్కలతో నిండి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుధ్య పనులు జరిపించాలని, ప్రత్యేకించి పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. లేనిపక్షంలో పాములు, ఇతర క్రిమికీటకాల వల్ల విద్యార్థులకు ప్రమాదం జరిగేందుకు అవకాశాలు ఉన్నందున తక్షణమే శానిటేషన్ పై దృష్టి కేంద్రీకరించాలన్నారు. రెండు రోజుల్లో పారిశుధ్య వ్యవస్థను చక్కదిద్దాలని, చేపట్టిన పనులకు సంబంధించిన వివరాలతో తనకు నివేదిక సమర్పించాలని ఎంపిడిఓను ఆదేశించారు. వారం రోజుల్లో తాను మళ్ళీ ఆకస్మిక తనిఖీకి వస్తానని, పరిస్థితిలో మార్పు కనిపించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆయా కార్యాలయాల ఆవరణలు శుభ్రం చేయించి, విరివిగా మొక్కలు నాటాలని హితవు పలికారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు కలెక్టర్ ను కలిసి తమ సమస్యలను నివేదించగా, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డీఆర్డీఓ సాయాగౌడ్, రెంజల్ మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారాం రాథోడ్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్రవణ్ కుమార్, ఎంపీఓ మహమ్మద్ రఫీ, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బలరాం తదితరులు ఉన్నారు.

## రుణమాఫీ దేవుడెరుగు.. వడ్డీ చెల్లించేందుకు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుంది : హరీశ్‌రావు



హైదరాబాద్ : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన పంటల రుణమాఫీపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. రుణమాఫీ దేవుడెరుగు.. వడ్డీ చెల్లించేందుకు రైతులు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుందని హరీశ్‌రావు పేర్కొన్నారు.డిసెంబర్ 9న రైతు రుణమాఫీ చేస్తామన్న మాట తప్పి, 7 నెలల తర్వాత ఆ ప్రక్రియను ప్రారంభించడం వల్ల రైతులకు కొత్త సమస్యలు ఎదురవుతున్నాయని హరీశ్‌రావు పేర్కొన్నారు. ముందుగా ఏడు నెలల వడ్డీ చెల్లించాకే, రుణ మాఫీ చేస్తామ ని బ్యాంకర్లు వేదిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారని తెలిపారు. ప్రభుత్వం చెప్పిన రుణమాఫీ దేవుడెరుగు, వడ్డీ చెల్లించేందుకు కొత్తగా అప్పులు చేయాల్సి వస్తుందని బాధపడుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.ప్రభుత్వం తక్షణం స్పందించి, డిసెంబర్ నుంచి జూలై దాకా వడ్డీని తామే భరిస్తామనీ, రైతుల నుంచి వసూలు చేయవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు హరీశ్‌రావు పేర్కొన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గం శివంపేట్ మండలానికి చెందిన ఒక రైతు క్రాప్ లోన్‌ను రూ.9000 మిత్తి కట్టించుకున్నాకే క్లోజ్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలానికి చెందిన రైతులకూ ఇదే పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాకు రైతులు పంపిన విజ్ఞప్తులను మీ పరిశీలనకు పంపుతున్నాను. పరిష్కరించాలని కోరుతున్నానని ప్రభుత్వానికి హరీశ్‌రావు విన్నవించారు.

# సంపాదకీయం

శనివారం 27-07-2024

## హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి అడుగులు !

హైదరాబాద్ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం కావాల్సి ఉంది. ప్రధానంగా మురుగునీరు, చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు,ట్రాఫిక్ సమస్యలు ఎప్పటినుంచో వేధిస్తున్నాయి. నగరంలో చెత్తను ఎక్కడపడితే అక్కడ వేసేస్తున్నారు. ఈ విషయంలో కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. చెత్తను వీధుల్లో ఎక్కడ పడితే అక్కడ పడేసే విధానాలకు స్వస్తి పలకాలి. అవసరమైతే జరిమానాలు విధించాలి. దీనికితోడు నగరంలో రోడ్లపై వెలసిన ఆలయాలు, దర్గాలు, ఇతర కట్టడాల తొలగింపుపై కఠిన చర్చలకు ఉపక్రమించాలి. లేకుంటే అవి రోడ్లకు అడ్డంగా ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయి. హైదరాబాద్‌తో అనుబంధం ఉన్న వారిని, రాజకీయ పార్టీలను కూర్చోబెట్టి ఈ సమస్యలపై చర్చించాలి. రోడ్డు మధ్యలో ఉన్న ప్రార్థనా స్థలాలు, దర్గాల తొలగింపు అనివార్యం కావాలి. నగర సుందరీకరణలో వీటి తొలగింపు అత్యంత ముఖ్యం. అలాగే నాలాల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి. డ్రైనేజీ వ్యవస్థను పటిష్టం చేసుకోవాలి. వర్షం వస్తే కాలనీలు మునిగే పరిస్థితి రాకుండా చూసుకోవాలి. ఈ క్రమంలో బడ్జెట్ ప్రతిపాదనలను చూశాక హైదరాబాద్ రూపురేఖలు మారబోతున్నాయి. ఇప్పటికే శివారు ప్రాంతాలు బాగా అభివృద్ధి చెందాయి. తెలంగాణకు మణిహారమైన హైదరాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో నగర అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించారు. శంషాబాద్ విమానాశ్రయం వరకూ మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు రూ.1500 కోట్లు, రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు రూ.1,525 కోట్లు, ఔటర్ రింగ్ రోడ్డుకు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు, మెట్రో వాటర్ వర్క్సకు రూ.3,385 కోట్లు కేటాయించారు. నగరంలో పారిశుద్ధ్య, మురుగు, నీటి, తాగునీటి సమస్యలు గత పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైనట్లు భట్టి విమర్శించారు. భాగ్యనగరాన్ని మరింత ప్రణాళికా బద్ధంగా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడతామన్నారు. ఈ కేటాయింపులు ఇంతగా గతంలో ఎప్పుడూ జరగలేదు. దీనికితోడు మెట్రో విస్తరణ, మూసీ సుందరీకరణతో నగర రూపురేఖలు మారుతాయి. పట్టణ విపత్తుల నివారణకు, వాటిని ఎదుర్కొన డానికి తీసుకోవాల్సిన చర్యలను చేపట్టడంతో పాటు, ఎలాంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొని తక్షణ రక్షణ చర్యలు తీసుకొనే విషయంలో జాతీయ, రాష్ట్రేతర సంస్థలతో సమన్వయాన్ని చేస్తుంది. ఈ సంస్థలో ఆస్తుల పరిరక్షణకు, విపత్తుల నిర్వహణకు ప్రత్యేక విభాగాలు ఉంటాయి. బడ్జెట్‌లో హైడ్రా సంస్థకు రూ.200 కోట్లు కేటాయించారు. దీంతో ఇప్పుడు హైడ్రా తన పనిని వేగంగా చురుకుగా చేపట్టడానికి వీలవుతుంది. అలాగే అన్యాక్రాంతం అయిన భూములను పరిరక్షించేందుకు వీలవుతుంది. ఇకపోతే ప్రధానంగా నగరంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉంది. సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో పాటు శివారు ప్రాంతాలు విస్తరించి, నగరంలో కలిసి పోవడం, పట్టణీకరణ విషయంలో క్రమపద్ధతి లేకపోవడంతో నగరం నరకకూపంగా మారుతోంది. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా సుమారు 110 చదరపు కి.మీల పట్టణ ప్రాంతం పునరుజ్జీవనం చెందుతుంది. అలాగే, నదీ తీర ప్రాంతంలో క్రొత్త వాణిజ్య, నివాస కేంద్రాలు వెలిసి, పాత హెరిటేజ్ ప్రాంతాలు క్రొత్తదనాన్ని సంతరించుకుంటాయి. ఈ ప్రాజెక్టు కోసం బడ్జెట్‌లో రూ.1500 కోట్లు ప్రతిపాదించడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చూడాలి. ఇకపోతే జిహెచ్‌ఎంసి పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.3,065 కోట్లు కేటాయింపు కూడా కలసి రానుంది. ఎయిర్ పోర్ట్ వరకూ మెట్రో విస్తరణకు రూ.100 కోట్లు, ఓఆర్ఆర్‌కు రూ.200 కోట్లు, హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్టుకు రూ.500 కోట్లు, పాత నగరానికి మెట్రో విస్తరణకు రూ.500 కోట్లు, మల్టీ మోడల్ సబర్బన్ రైలు ట్రాన్స్‌పోర్ట్ సిస్టమ్‌కు రూ.50 కోట్లు కేటాయింపు జరిగింది. ఇవన్నీ కూడా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేవే. ఇకపోతే నగరంలో విలువైన భూములు అన్యాక్రాంతం అయినా గత పదేళ్లుగా పట్టింపు లేకుండా పోయింది. ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌లోని ప్రభుత్వ భూములు ఏ విధంగానైతే అన్యాక్రాంతమయ్యాయో, స్వరాష్ట్రంలో దానికి రెట్టింపు భూ విధ్వంసం జరిగింది. ఆనాటి గొలుసుకట్టు చెరువులు చాలా మాయం చేసి, కొండలు, గుట్టలను పిండి చేసి రియల్ ఎస్టేట్ ప్లాట్లుగా మార్చేసి అమ్మేశారు. గత ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ప్రభుత్వ భూములకు రక్షణగా ఉండే వీఆర్ఓ, వీఆర్ఏలను రెవెన్యూశాఖ నుంచి దూరం చేయడంతో కబ్జాలకు ప్రభుత్వమే ఉసిగొలిపినట్ట య్యింది. అధికార అండతో విలువైన భూములను కాజేశారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో జరిగిన భూ విధ్వంసంపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ భూములను, చెరువులను కాపాడేందుకు సీఎం రేవంత్ రెడ్డి సరికొత్త ఆలోచన చేసి, హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ హైడ్రా అనే ఓ ప్రత్యేక విభాగాన్నే ఏర్పాటు చేశారు. బడ్జెట్‌లో 'హైడ్రా'కు 200 కోట్ల రూపాయల కేటాయింపు ప్రభుత్వ సంకల్ప శుద్ధికి నిదర్శనం. జీహెచ్‌ఎంసీ పరిధిని ఔటర్ రింగు రోడ్డు వరకు విస్తరించేందుకు సీఎం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నందున, జీహెచ్‌ఎంసీతో పాటు ఔటర్ వరకు ఉన్న ప్రాంతాలు హైడ్రా పరిధిలోకి రానున్నాయి. సుమారు 2 వేల చదరపు కిలోమీటర్లు, 27 మునిసిపాలిటీలు, 33 పంచాయతీలను కలుపుకొని స్వయం ప్రతిపత్తితో ఉండేలా హైడ్రాను అందుబాటులోకి తెచ్చారు. చెరువుల కబ్జాలకు అడ్డుకట్ట వేయడం, ప్రభుత్వ స్థలాల పరిరక్షించడం, అక్రమ నిర్మాణాలను నియంత్రించడంలో ప్రధాన భూమికను పోషించనుంది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణతో పాటు విపత్తుల నిర్వహణలోనూ అది కీలకం. జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ పరిధిలో వేలాది ఎకరాల ప్రభుత్వ, చెరువు, వక్ఫ్, దేవాదాయశాఖ, పార్కులు, ఇనాం భూములు కబ్జాదారుల చెరల్లో ఉన్న విషయం తెలిసిందే. గత కొన్నేళ్లుగా ఈ ఆక్రమణలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఇంకా చెరువులు, కుంటలు, నాలాలు, ప్రభుత్వ భూములు కబ్జాల పాలవుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో కబ్జాదారుల బారి నుంచి సర్కారు భూములకు విముక్తి కల్పించడంతోపాటు ఇకముందు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా నిరోధించడం కోసం సరికొత్తగా రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను అందుబాటులోకి తెచ్చింది.

# ఘనంగా కార్గిల్ దినోత్సవం...

**కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలు**

**ఎంతోమంది ప్రాణత్యాగ ఫలమే కార్గిల్ యుద్ధ విజయం -ఆర్ డిఓ జి.అంబాదాస్ రాజేశ్వర్**

**భారతీయ సైనికుల పరాక్రమం ప్రేరణాదాయకం వారి త్యాగం నిత్యం స్మరణీయం-ఏసీపీ పి.శ్రీనివాస్**









బోధన్, జూలై 26 (లోకంతీరు) :ఎంతోమంది ప్రాణత్యాగ ఫలితమే కార్గిల్ యుద్ధ విజయమని బోధన్ ఆర్ డిఓ జి.అంబాదాస్ రాజేశ్వర్ అన్నారు.శుక్రవారం బోధన్ డిగ్రీ కళాశాలలో కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఆధ్వర్యంలో ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బోధన్ ఆర్ డిఓ మాట్లాడుతూ....25 సంవత్సరాల క్రితం ఎంతో మంది జవాన్లు ప్రాణాలు త్యాగం చేసి దేశానికి కార్గిల్ యుద్ధ విజయాన్ని అందించారన్నారు. 1999లో పాకిస్తాన్ సైనికులు, ఉగ్రవాదులు భారత భూభాగాన్ని ఆక్రమించుకోవాలని పాక్ చేసిన ప్రయత్నాన్ని ఆపరేషన్ విజయ్‌తో కార్గిల్ నుంచి పాక్ సైనికులను తరిమికొట్టారన్నారు. అప్పటి అమరులైన భారత జవాన్లను స్మరించుకుంటూ కార్గిల్ విజయ్ దివస్ ఈ రోజుతో రజతోత్సవం జరుపుకున్నామన్నారు. ఇలాంటి కార్యక్రమాన్ని సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ వీరులను స్మరించుకోవాలన్నారు. యువతలో చిన్నతనం నుంచి దేశభక్తి పెంపొందించుకోవాలన్నారు.భారతీయ సైనికుల పరాక్రమం ప్రేరణాదాయకం వారి త్యాగం నిత్యం స్మరణీయం-ఏసీపీ పి.శ్రీనివాస్ :-×భారతీయ సైనికుల పరాక్రమం ప్రేరణాదాయకం వారి త్యాగం నిత్యం స్మరణీయం అని ఏసీపీ పి.శ్రీనివాస్అన్నారు. దేశ సరిహద్దుల్లో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ, తమ ప్రాణాలకు తెగించి శత్రువుల కుట్రలను తిప్పికొడుతూ, దేశ ప్రజలకు రక్షణగా నిలుస్తున్న మన దేశ సైనికుల పోరాటం అసామాన్యం, అనితర సాధ్యం అన్నారు. దేశ రక్షణ కోసం కార్గిల్ యుద్ధంలో వీరోచితంగా పోరాడి వీర మరణం పొందిన అమర జవానులకు ప్రతి ఒక్కరు స్మరించుకోవాలన్నారు×. అలాగే బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్ కార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలలో ప్రసంగించారు. అలాగే విధి నిర్వహణలో మృతి చెందిన గంగ ప్రసాద్ చిత్ర పటనికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. అలాగే వారి తల్లిదండ్రులను సన్మానించారు.బహుమతులు ప్రధానంకార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలలో నిర్వహించిన్న మొదటి, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు ముఖ్య అతిథిలు చేతులు మీదుగా బహుమతులు ప్రధానం చేశారు.ఎన్ సిసి క్యాడేట్లతో ర్యాలీకార్గిల్ విజయ్ దివస్ రజతోత్సవ వేడుకలు పురస్కరించుకొని బోధన డిగ్రీ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీగా వచ్చారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, బోధన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ సురేష్, జిల్లా మహిళా సంక్షేమ అధికారిణి ఎస్.కె.రసూల్ బి, సిడిపిఓ జానికి, మాజీ కెప్టెన్ వై.శ్రీనివాస్, ఎన్ సీసీ లెఫ్టినెంట్ లు డాక్టర్ వి.నర్సింహులు, నాగేశ్వరరావు, శైలు, అధ్యాపకులు, ఎన్ సీసీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## ఎడిఎం కు ఘనంగా సన్మానం..





నిజామాబాద్,జులై 26(లోకంతీరు): ,మొదటి ఎ.డి.ఎమ్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ను ఘనంగా సన్మానించిన నిజామాబాద్ బార్ అసోసియేషన్ సభ్యులు×....నిజామాబాద్ ఫస్ట్ అడిషనల్ కోర్టు ఏ.పి.పి గా నియామితులైనటువంటి మహమ్మద్ రహీముద్దీన్ గారిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్, పి.రాజు, వసంత్, పిల్లి శ్రీకాంత్ , పులి జైపాల్, నారాయణ, బిట్ల రవి, శ్రీనివాస్, శ్రీమన్ తదితరులు పాల్గొన్నారు.

## చిల్లర వ్యాపారులపై ఉన్న శ్రద్ధ బడా వ్యాపారుల మీద లేకపాయే....



నిజామాబాద్ లో వీధి వ్యాపారులతో ట్రాఫిక్ పోలీసు వాగ్వివాదం× కనుమరుగైన అధికారులు× స్థానిక నాయకుల కనుసైగల్లోన ?నిజామాబాద్ అర్బన్, జులై 26 ( లోకంతీరు ): నిజామాబాద్ కు రోజు చుట్టుపక్కల గ్రామాల నుండి రైతులు తాము పండించిన కూరగాయలను అదేవిధంగా కొంతమంది తాము తమ కుటుంబాన్ని పోషించే నిమిత్తం ఉదయం జరిగే బీట్ లో కూరగాయలను కొనుక్కొని వచ్చేవాళ్లు దేవి రోడ్డు ప్రాంతంలో, నాందేవ్వాడ బ్రిడ్జ్ దిగే స్థలంలో , గంజి రోడ్డులో అమ్ముకోవడం జరుగుతుంది. వారు రోజువారీగా థాయ్ బజార్ కి డబ్బులు చెల్లిస్తూ కూడా ఎండా,వాన అనకుండా వాళ్లు తెచ్చిన కూరగాయలను పనులను అమ్ముకొని వారు తమ జీవనాన్ని గడుపుతుంటే అదే అదునుగా తీసుకొని అక్కడ విధి నిర్వహణలో ఉన్నటువంటి ట్రాఫిక్ పోలీసులు వారిపై దౌర్జన్యంగా వ్యవహరిస్తూ మీ వల్ల ఇక్కడ ఇబ్బందిగా ఉంది అని బెదిరిస్తూ అంతేగాకుండా వారి దగ్గర కొనుగోలు చేసే వినియోగదారుడికి ట్రాఫిక్ ఛానల్ వేయడం ఇది ఏమిటని ప్రశ్నించిన వారిపై కూడా దౌర్జన్యంగా వ్యవహరించడం జరుగుతుంది. కానీ బడా వ్యాపారులు ప్రధాన రోడ్లపై, కూడళ్ళ పై సగముకు పైగా రోడ్లను ఆక్రమించి తమ వ్యాపారాలు నిర్వహిస్తున్న కూడా వారిని అడిగి ప్రశ్నించే దిక్కు లేదు.చట్టాలన్నీ ఎప్పుడు పెద్దవారికి చుట్టాలే. వాటితో అల్ప ప్రాణులకు ఎపుడు కష్టాలే.వీధి వ్యాపారులను ప్రోత్సహించదానికే కదా మున్సిపల్ శాఖ ధాయి బజార్ అనే వ్యవస్థను ఏర్పాటు చేసి దానికిగాను టెండర్లను నిర్వహించి లక్షలలో తీసుకోవడం జరుగుతుంది.ఇలాంటి వీధి వ్యాపారులు దేవి రోడ్డు చౌరస్తా, గాంధీ చౌక్, బోధన్ బస్టాండ్, నటరాజ్ థియేటర్ , శివాజీ చౌక్ ప్రాంతం. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ప్రాంతాలు ఉన్నాయి కాబట్టి ఈ ప్రదేశాలలో చాలామంది చాలా గ్రామాల నుంచి వచ్చి వీధి వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వినియోగదారులు వాటిని కొనే క్రమంలో నగర ట్రాఫిక్ పోలీసులు తమ వాహనాలకు వేసే ఛానల్లు చూసి బెంబేలెత్తుతున్నారు. కొనుగోలుదారులకు అదే విధంగా వీధి వ్యాపారుల పట్ల సంయమనతో వ్యవహరిస్తూ వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మున్సిపల్ అధికారులు , నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే , నిజామాబాద్ ఎంపీ, ఈ వ్యవహారంనకు సంబంధిన అధికారులు ఈ సమస్యల పట్ల సానుభూతితో వ్యవహరిస్తూ వీధి వ్యాపారాలకు ఏదైనా ఒక అనుకూలమైన ప్రాంతాన్ని తమకు కేటాయించి న్యాయం చేయాలనీ వీధి వ్యాపారాలు కోరుతున్నారు.ఈ విషయమై ఒక స్థానిక రిపోర్టర్ ట్రాఫిక్ పోలీసును ప్రశ్నించటంతో వివాదాస్పదమైన మాటలతో చిరు వ్యాపారులతో , విలేకర్ల పైన అసహనం వ్యక్తం చేశాడు . ఇలా రోజూ జరిగే సమస్యపై అధికారులు దృష్టి సారించి పరిష్కరించగలరని ప్రజలు కోరుతున్నారు.

## కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా సిద్దిపేట లో ర్యాలీ

**పాల్గొన్న అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి..**

సిద్దిపేట జూలై 26, (న్యూస్ పల్స్) కార్గిల్ విజయ దివాస్ సందర్భంగా సిద్దిపేట లో నిర్వహించిన ర్యాలీలో అడిషనల్ డీసీపీ యస్. మల్లారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ కార్గిల్ విజయ్ దివాస్ 25వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలతో కలిసి సిద్దిపేట పట్టణం బిజెఆర్ చౌరస్తా నుండి అంబేద్కర్ సర్కిల్ వరకు విద్యార్థినీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. మరియు జూలై 26 1999 భారతదేశ సైన్యం పాకిస్తాన్ సైన్యంపై వీరోచితంగా పోరాడి విజయం సాధించిన దానిని గుర్తుగా ఈ దినోత్సవం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. భారత భూభాగంలోకి ప్రవేశించిన పాకిస్తాన్ సైన్యాన్ని తిప్పి కొట్టి భారతదేశ భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవడంలో ఎంతోమంది సైనికులు వీరమరణం పొందారు. భారత్ సైనికులు విజయం సాధించారు. అందువల్ల ప్రతి ఏటా జూలై 26న వారిని స్మరించుకోవడం కోసం కార్గిల్ విజయ్ దివాస్ కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతుందన్నారు. ర్యాలీని విజయవంతం చేసిన ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాన్ని అభినందించారు.ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఏసీపీ మధు, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, మరియు పోలీస్ సిబ్బంది ప్రైవేట్ స్కూల్ యాజమాన్యం మరియు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టా పాస్ బుక్ పొందిన వారు రైతు భీమాదరఖాస్తు చేసుకోవాలి



రాజంపేట కామారెడ్డి జిల్లా జూలై 26 లోకంతీరురాజంపేట మండలంలో నూతనంగా పట్టా పాసు బుక్కు వచ్చిన రైతులు రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల ప్రజలకు మండల వ్యవసాయ అధికారి సుప్రజ్యోతి శుక్రవారం తెలియజేశారు. రైతు మరణిస్తే ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల బీమా పరిహారం ప్రభుత్వం ద్వారా సంబంధిత నామినీకి ఇవ్వడం జరుగుతుందన్నారు.గ్రామంలో ఒక్క గుంట నుంచి ఎన్ని ఎకరాలు ఉన్న రైతు అయినా ప్రమాదవశాత్తు, ఏ ఇతర కారణాల వల్ల మరణించిన రైతు కుటుంబాలు ఆగం కావద్దని వారిని ఆర్థికంగా అదుకునే ఉద్దేశంతో వారి సంక్షేమం కోసం లబ్ధి చేకూరుస్తూన్న రైతు భీమా పథకాన్ని యధావిధిగా కొనసాగించడం హర్షణియమన్నారు. కావునా రైతులు భీమా దరఖాస్తు ఫారం నింపి దానితో పాటు నూతనంగా వచ్చిన పట్టా పాస్ బుక్, రైతు ఆధార్ కార్డు, నామిని ఆధార్ కార్డు, సంబంధిత గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారికి అందజేయాలని, ప్రతి ఒక్కరూ రైతు వేదిక భవనంలో రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడం ప్రభుత్వ లక్ష్యం

కామారెడ్డి జిల్లా జూలై 26 లోకంతీరుజిల్లాలోని రాజంపేట మండలంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పత్రిక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని, రైతును రాజుగా చేసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని, గురువారం బడ్జెట్ సమావేశంలో రైతులకు పెద్ద ఎత్తున బడ్జెట్ 72,659 కోట్లు కేటాయించడం సంతోషకరమైన విషయం అని అన్నారు. రైతులకు బడ్జెట్ కేటాయించడంతో రైతులు ఆనందంలో ఉన్నారని రైతులకు రైతు రుణమాఫీ, రైతు భీమా చేయడం రైతులు ప్రభుత్వానికి రుణపడి ఉంటారని వారన్నారు. రాజంపేట మండలంలో కొండాపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కావాలని గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు విన్నవించిన ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు చొరవతో వైద్య ఆరోగ్య శాఖ పి హెచ్ సి నుంచి నిధుల గురించి వివరించడం జరిగిందని, ముందు పి హెచ్ సి పనులు కూడా అతి త్వరలో అయిపోతుందన్నారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఎల్లారెడ్డి వర్గానికి మరింత అభివృద్ధి పనులు సాగుతాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, జిల్లా ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు వినోద్ కుమార్, డివిజన్ అధ్యక్షులు మదన్, మండల ఉపాధ్యక్షులు మశెట్టి శ్రీధర్, బన్సీలాల్, నంజీవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# వ్యవసాయ రంగానికి పెద్దపీట వేసిన కాంగ్రెస్

### మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్



కామారెడ్డి జిల్లా జులై 26 లోకంతీరు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2024-25 అర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్లో వ్యవసాయ, అనుబంధ రంగాలకు పెద్దపీట వేస్తూ 72,659 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించడం హర్షణీయమని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్న గారి నాగరాజ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలకు ఆలంబనగా నిలుస్తూన్న ప్రజా ప్రభుత్వం ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్ నూటికి నూరు శాతం రైతు పక్షపాత బడ్జెట్ అని అన్నారు. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఇదే అత్యధిక బడ్జెట్ అని గడచిన పదేళ్లలో వ్యవసాయ రంగానికి ఇంత పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయింపులు జరగలేదన్నారు. వ్యవసాయ రంగంలో ప్రాధాన్య పథకాలు రైతు రుణమాఫీ, రైతు బీమా, రైతు భరోసా, పంటల బీమా, పంటలకు బోనస్, భూమిలేని రైతు కూలీలకు ఆర్థిక సాయం వంటి పథకాల అమలుకు పూర్తి స్తాయిలో బడ్జెట్ లో నిధులు కేటాయించడం వ్యవసాయ రంగానికి కాంగ్రెస్ పార్టీ పెద్దపీట వేసిందనడానికి ఇదే నిదర్శనమన్నారు. తమది రైతు పక్షపాతి ప్రభుత్వమని కాంగ్రెస్ పార్టీ నిరూపించిందని వ్యవసాయ రంగానికి అధికంగా నిధులు కేటాయించడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ రైతాంగం పక్షాన ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు.

# కేజీవీబి లో వైద్య శిబిరం

## వైద్యాధికారి సురేష్






కామారెడ్డి జిల్లా రామారెడ్డి జులై 26 (లోకంతీరు) రామారెడ్డి కేజీవీబీ హాస్టల్ పిల్లలకు వైద్యాదికారి సురేష్ వైద్యబృందం తో ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు చేసి జ్వరం ఉన్న వారి నుండి రక్తం సేకరించి వారికి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న పిల్లలకు మందులు అందించారు. అనంతరం డాక్టర్ సురేష్ మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా, టైఫైడ్ , మొదలగు వ్యాధుల ప్రబల కుండా ఉండాలంటే మనచుట్టూ ప్రక్కల పరిసరాలు బాగుంచుకోవాలి. గుంటలల్లో నీళ్లు నిల్వ ఉండ కుండా చూసుకోవాలి. తినే పదార్థాలు శుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలి. మంచి నీళ్లు కాచి వాడ పోసుకొని త్రాగాలి ఇలా ప్రత్యేక మైన చర్యలు తీసుకుంటే ఎలాంటి వ్యాదులు దగ్గరకు రావు అని పిల్లలకు సీజనల్ వ్యాధుల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అన్నారం వైద్యురాలు డాక్టర్ మానస, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గ్రామ దేవతలకు ఘనంగా పూజలు



కామారెడ్డి జిల్లా రామారెడ్డి జులై 26 (లోకంతీరు)రామారెడ్డి మండల గొల్లపల్లి గ్రామం లో ఘనంగా గ్రామ ప్రజలు గ్రామ దేవతల పండుగ ను అన్ని వర్గాల కుల పెద్దలు గరుగుల్ గ్రామ బిటి రోడ్డు దగ్గర ఉన్న నాయకమ్మ దేవతలకు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాబోయే రోజుల్లో ఈ సంవత్సరం లో అందరూ బాగుండాలని ఆయు అష్టశ్వర్య లతో సుఖ సంతోషాలతో ఆరోగ్య కరంగా గ్రామ ప్రజలు అందరు బాగుండాలని మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గరుగుల్ గ్రామ మాజీ సర్పంచ్ గుడి నిర్మాణ ప్రదాత మొగుళ్ల సాయగౌడ్, రామగౌడ్, గొల్లపల్లి గ్రామ మాజీ సర్పంచ్ లావణ్య మల్లేశ్, గ్రామ విడిసి చైర్మెన్ మర్రి అంజయ్య, గ్రామ పెద్దలు బీరయ్య, ఎల్లయ్య, సుమన్, మహేష్, వి డి సి కార్యదర్శి రెడ్డి మల్లేశ్, వి సాయిలు, కందురీ సాయిలు, జెపి మహేష్, గొల్ల మల్లయ్య, గొల్ల నవీన్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు నీటి జోలికి రావద్దు..!





కామారెడ్డి జిల్లా (లోకంతీరు) జూలై 26సదాశివనగర్ మండలం అడ్లూరు ఎల్లారెడ్డి గ్రామంలోని పెద్ద చెరువు నీటిని కామారెడ్డి పట్టణ తాగునీటి కోసం మల్లిస్తామని కామారెడ్డి మున్సిపల్ చైర్మన్ ప్రకటించడం సమంజసం కాదని సదాశివ నగర్, రామారెడ్డి మండల బారాస నాయకులు అన్నారు. శుక్రవారం అడ్లూర్ ఎల్లారెడ్డి పెద్ద చెరువు కింద ఉన్న ఏడు గ్రామాల రైతులు నాయకులు సమావేశం ఏర్పాటు చేసి కామారెడ్డి మున్సిపాలిటీ పాలకవర్గం తీసుకున్న నిర్ణయం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు తొమ్మిది గ్రామాలకు సాగునీరు అందించే పెద్ద చెరువు నీటిని తాగునీటికి తరలిస్తామని చెప్పడం జరిగిందని ఇది సరైననిర్ణయం కాదన్నారు. ఈ చెరువు కింద చిన్న సన్నకారు రైతులకు సుమారు 900 ఎకరాలు రెండు పంటలు పండిస్తారని అలాంటిది రైతుల పొట్టగొట్టి 30% నీటిని కామారెడ్డి పట్టణానికి తాగునీటికి తీసుకుంటామని ప్రకటించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రైతు ప్రభుత్వం గా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రైతుల పొట్టగొట్టి తాగునీటి కోసం నీటిని మళ్ళిస్తామని ప్రకటించడం సమంజసం కాదన్నారు. అలాంటి నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే తొమ్మిది గ్రామాల రైతుల ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కామారెడ్డి పట్టణానికి అవసరమైతే రెండో పైపులైన్ విసి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా గాని కామారెడ్డి పెద్ద చెరువు లోతుగా చేసి నీళ్లు నిలువ చేసుకోవాలని వారు సూచించారు. ఈ సమావేశంలో సదాశివ నగర్ రామారెడ్డి మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు బొల్లిపెల్లి మహేందర్ రెడ్డి, రంగు రవీందర్ గౌడ్, సదాశివ నగర్ మాజీ జెడ్పిటిసి పడిగేల రాజేశ్వరరావు , రామారెడ్డి మాజీ ఎంపీపీ నా రెడ్డి దశరథ్ రెడ్డి, అడ్లూరు ఎల్లారెడ్డి వీడీసీ చైర్మన్ ఎడ్ల నర్సింలు, కురుమ సహకారసంఘం అధ్యక్షులు బీరయ్య, రామారెడ్డి మండల బీయారెస్ సీనియర్ నాయకుడు పోతుల లింగారెడ్డి, ఆశరాజు కళాలి సాయ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ టంకరి రవి, ఇస్రోజివాడి మాజీ సర్పంచ్ కొత్త రాజు, రవీందర్ రెడ్డి కన్నాపూర్ మాజీ సర్పంచ్ రాజనర్సు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, గిరిజన నాయకుడు లింబాద్రి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్





కామారెడ్డి జిల్లా జూలై 26 లోకంతీరుకామారెడ్డి పురపాలక సంఘ పట్టణ పరిధిలో గల ఇందిరా నగర్ కాలనీ డబుల్ బెడ్ రూం ఇండ్ల వద్ద "డ్రై డే ఫ్రై డే కార్యక్రమములో" భాగంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ శుక్రవారం పరిశీలించారు. ఈ కాలనీలో మురికి కాలువలు శుభ్రముగా చేయుమని ఆదేశించారు. కామారెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు అట్టి మురికి కాలువలు శుభ్రపరిచారు. రామారెడ్డి రోడ్డుకు ఇరువైపుల మురికి కుప్పలు తొలగించి మొక్కలు నాటుమని మరియు రంగవల్లులు చేయించవలసినదిగా ఆదేశించినారు. ప్రజలు ఎవరైనా రోడ్లపై చెత్త వేసినచో వారికి అదనంగా రుసుము విధించుమని పురపాలక సిబ్బందికి ఆదేశించినారు. అనంతరం డి ఆర్ సి సి సెంటర్ ను కూడా సందర్శించారు. అదేవిధముగా పెద్ద చెరువు ఫిల్టర్ బెడ్ సందర్శించి, చుట్టు ప్రక్కల పరిసరాలను శుభ్రం చేయించవలసినదిగా ఆదేశించినారు. ఈ కార్యక్రమములో మున్సిపల్ చైర్మన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి, చైర్ పర్సన్ పురపాలక సిబ్బంది, రెవిన్యూ డివిజినల్ అధికారి, మండల రెవిన్యూ అధికారి, కమిషనర్, పురపాలక సంఘం అధికారులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

# నిరాశ కలిగించిన కాంగ్రెస్ బడ్జెట్

### దశదిశ లేదన్న మాజీమంత్రి వేముల



నిజామాబాద్,జూలై26(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ పసలేనిదిగా ఉందని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రభుత్వ మొదటి బడ్జెట్ దశ దిశ లేకుండా ఉందని, ఇది తిరోగమన దిశలో నడిపే బడ్జెట్ అని అభివర్ణించారు. బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ చేసిన ఆరోపణలకు సమాధానం ఇవ్వకుండా విమర్శించడం సరికాదన్నారు. పదేళ్లలో అన్నిరంగాలను అభివృద్ధి చేసిన గనత కెసిఆర్దని అన్నారు. ఏడాదిలో 2 లక్షలు ఉద్యోగాల ప్రస్తావనే లేదని, ఆరుగ్యారంటీలను పూర్తిగా మరిచిపోయారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు చేసిందని నిందించారని, భట్టి 57 వేల కోట్లు అప్పు తెస్తామన్నారని.. చెప్పారు. మహాలక్ష్మి పథకంపై బడ్జెట్ మహా నిరాశ కలిగించిందని, కోటి మంది మహిళలు నెలకు రూ. 2500 కోసం ఎదురుచూస్తున్నారని, ఎనిమిది నెలల్లో మహిళలకు రూ.20వేల కోట్లు ప్రభుత్వం బకాయి పడ్డదని చెప్పారు. ఆసరా పింఛను రూ. 4 వేలు ఇస్తామని బాండు పేపర్ మీద రాశారని, మరి ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. విద్యార్థులకు 5 లక్షల విద్యా భరోసా కార్డు, స్కూటీలు ఇస్తామన్నారని వాటి ప్రస్తావన ఏదని నిలదీశారు. కొత్త రేషన్ కార్డులు, రెండు లక్షల ఉద్యోగాలు, జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతి ప్రస్తావన కూడా లేదని మండిపడ్డారు. ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పి మొండిచేయి చూపారని, చేనేత కార్మికులకు గుండు సున్నా చూపారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇకపోతే రుణమాఫీ పేరిట రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మభ్యపెడుతున్నదని వేముల ప్రశాంత్ రెడ్డి మండిపడ్డారు. తక్కువ మందికి రుణమాఫీ చేసినందుకు సంబురాలు చేసుకోవాలా? అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది రైతులకు లబ్ది చేకూరినట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో కేవలం 94వేల 566 మంది రైతులకు రూ.459 కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని మండిపడ్డారు. రైతు సంక్షేమం కోసం ప్రపంచంలోనే ఏ రాజకీయ పార్టీ, ఏ రాజకీయ నాయకుడు తలపెట్టని కార్యక్రమాలను కేసీఆర్ చేసి చూపించారని తెలిపారు. 60 ఏండ్లు దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ రైతుబంధు, రైతుబీమా ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వానకాలం సీజన్కు సంబంధించి ఎకరానికి రూ.7500 చొప్పున రైతుభరోసా ఇవ్వాల్సి ఉండగా రూ.11,250 కోట్లు ఎగ్గొట్టి ఆ డబ్బులతో రుణమాఫీ కింద రూ.6098 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఏదో ఘనకార్యం చేసినట్లుగా గోబెల్స్ ప్రచారాన్ని కాంగ్రెస్ చేస్తుండడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఈ మోసానికి రైతులు సంబురాలు చేసుకోవాలా అని ప్రశ్నించారు. కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రం మొత్తం రుణమాఫీని 37లక్షల మంది రైతులకు వర్తింపజేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ కార్డు, లోన్ రీషెడ్యూల్, ఆదాయ పన్ను పేరిట కొర్రీలు పెట్టి 26లక్షల మంది రైతులను ఏరి పారేసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు కేవలం 11లక్షల మంది రైతులకు కుదించి రుణమాఫీ అమలు చేస్తున్నారని తెలిపారు. ఉద్యోగాలు చేసుకునే రైతు కుటుంబాలు, చిన్న వ్యాపారాలు చేసుకునే రైతులకు కూడా రుణమాఫీ అమలు చేయాలని వేముల డిమాండ్ చేశారు.

# ఆయిల్ ఫాం సాగు అత్యంత లాభదాయకమైనది..

### జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి

సిద్దిపేట జూలై 26, (న్యూస్ పల్స్) శుక్రవారం సమీకృత జిల్లా కార్యలయ సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లాలోని ఆయిల్ ఫెడ్, వ్యవసాయ మరియు ఉద్యానవన శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ మను చౌదరి సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జిల్లాలో ఇప్పటి వరకు 11,373 ఎకరాల్లో ఆయిల్ ఫాం సాగవుతుందని అలాగే 2024-25సంవత్సరానికి గాను 4000ఎకరాల లక్ష్యం పెట్టుకొని ఈ సంవత్సరం 2816ఎకరాలు రిజిస్టేషన్ పూర్తి, 1019ఎకరాల లో అడ్మినిస్ట్రేటివ్ సాంక్షన్ ఆయి 268ఎకరాల్లో మొక్కలు పెట్టడం జరిగిందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ ఫాం సాగు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుందని జిల్లాకు ఇచ్చిన 4000ఎకరాల లక్ష్యాన్ని తప్పనిసరిగా పూర్తి చెయ్యాలి. అలాగే ఆయిల్ పాం కర్మాగారం సైతం వచ్చే ఏడాది మార్చి నెల లోపూ పూర్తి అవుతుందని అన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు రైతుల ఇంటికి వెళ్ళి ఆయిల్ పాం వల్ల కలిగే లాభాలు తెలుపి ప్రేరణ కల్పించాలి. గ్రామాల్లో అయిల్ ఫాం సాగు గుర్చి పెద్ద ఎత్తున ప్రచారం చెయ్యాలి. రైతులకు ఆయిల్ ఫాం గుర్చి వివరంగా తెలియడం కోసం ఇది వరకు ఆయిల్ ఫాం పంట వేసి లాభాలను ఆర్జించిన రైతులను మరియు ఆయా పంటలను క్షేత్ర స్థాయిలో విక్షించేందుకు చర్యలు తీసుకోవాలని అదికారులకు తెలిపారు. ఆయిల్ పాం సాగులో దశలు రైతులను ఎంపిక చెయ్యడం, డిడి కలెక్షన్లు, మార్కింగ్, డ్రిప్ ఫిట్టింగ్, మొక్కలు పెట్టడం అనే పక్రియను వెంటవెంటనే పూర్తి చెయ్యాలి. మీ మండలాలోని పనిలో వెనకబడిన క్లస్టర్ల ను రోజువారీ పర్యవేక్షణ చేసి ఆయా క్లస్టర్ లలో రైతులతో వ్యవసాయ, ఉద్యాన వన శాఖ అధికారులు మీటింగ్ లు పెట్టాలి. పెద్ద భూస్వాములనే కాకుండా చిన్న, సన్న కారు రైతులను కూడా ఆయిల్ ఫాం వైపు మళ్ళించాలి. ప్రోగ్రేస్ తక్కువ ఉన్న క్లస్టర్ లలో ఈ సీజన్ పంట పూర్తైన తర్వాత రైతులను గుర్తించాలి. ఆయుల్ పాం వేసే రైతుల భూముల్లో సమస్యలు ఎదురైతే ఆయా మండల తహసిల్దార్ కి తెలిపి పరిష్కరించుకోవాలి. అలాగే విద్యుత్ సమస్యలు ఎదురైతే విద్యుత్ శాఖ అదికారులకు తెలపాలని సూచించారు. వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, ఆయిల్ ఫ్రెడ్ కార్పొరేషన్ అధికారులు అందరు సమన్వయంతో 100% పూర్తి లక్ష్యాన్ని చేరేవిధంగా పని చేయ్యాలని అదికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మహేష్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, ఆయిల్ ఫెడ్ కన్సల్టెన్సీ అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ ఎల్సికాలువలో పూడి కత్తిత పనులు

కోసిగి ,కోసి మండల పరిధిలోని ఎల్ఎల్సీ కాలువలో పూడి కతీత పనులను టిడిపి నాయకులు మాజీ సాగునీటి సంఘం పార్లమెంట్ మాజీ సాగునీటి సంఘం అధ్యక్షులు పల్లెపాడు రామి రెడ్డి, కర్నూల్ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ముత్తారెడ్డి కాలువలు పరిశీలించి పరిశీలించారు. గురువారం మండల కేంద్రంలో కోసిగి మండల సమీపంలోని ఎల్.ఎల్సీ కాలువలో పూడి కతీత పనులతో పాటు గతంలో ఎల్ఐసి కాలువల్లోకి దీని ద్వారా రైతులకు ప్రజలకు కాలువలోకి డ్రైనేజీ నీళ్లు రాకుండా అడ్డుకట్ట వేసి కాలువల్లో పేరుకుపోయిన బురద చెత్తచెదారం వంటి తొలగించడం జరిగిందని వారన్నారు. ఆయకట్ట రైతులందరికీ ఎల్ఎల్సీ ద్వారా సాగునీటి అందిస్తామని టిడిపి నాయకులు తెలిపారు ఇందులో టిడిపి నాయకులు నాడిగేని చిన్న తాయన్న, కొండగని నరసన్న తదితరులు ఉన్నారు.

# జైలు నుంచి విడుదలై 'కమ్ బ్యాక్' ర్యాలీ.. మళ్లీ కటకటాలపాలైన గ్యాంగ్‌స్టర్

జైలు నుంచి విడుదలైన ఆనందంలో అత్యుత్సాహం ప్రదర్శించిన ఓ గ్యాంగ్ స్టర్ ఇప్పుడు కోరి సమస్యలను కొని తెచ్చుకున్నాడు. కేసు నుంచి బయటపడ్డానన్న సంతోషం కాసేపు కూడా లేకుండానే మరోసారి కటకటాలపాలయ్యాడు. మహారాష్ట్ర నాసిక్‌కు చెందిన గ్యాంగ్‌స్టర్ హర్షద్ పాటంకర్ హత్యాయత్నం, దొంగతనాలు వంటి కేసుల్లో గతంలో అరెస్టయ్యాడు. అయితే, జులై 23వ తేదీన అతడు జైలు నుంచి విడుదలయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న అతడి మద్దతుదారులు భారీ ర్యాలీ చేపట్టారు. బేతేల్ నగర్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకూ 'కమ్ బ్యాక్' ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ సందర్భంగా హర్షద్ సన్‌రూఫ్ కారులో వెళ్తుండగా.. పలు కార్లు, సుమారు 15 ద్విచక్ర వాహనాలు అతడిని అనుసరించాయి. ఈ సందర్భంగా కారు రూఫ్ నుంచి హర్షద్ తన మద్దతుదారులకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. ఇందుకు సంబంధించిన వీడియోని అతడి మద్దతుదారులు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అదికాస్తా వైరల్‌గామారి పోలీసుల దృష్టికి చేరింది. దీంతో పోలీసులు హర్షద్‌పై చర్యలు చేపట్టారు.

# ఉత్తరాఖండ్‌లో విరగిపడ్డ కొండచరియలు

### కొట్టుకు పోయిన చెక్క వంతెన

డెహ్రాడూన్,జూలై26(ఆర్ఎన్ఎ): భారీ వర్షాలు, కొండ చరియలు విరిగిపడుతుండడంతో 50మంది యాత్రికులు చిక్కుకుపోయిన ఘటన ఉత్తరాఖండ్‌లో చోటుచేసుకుంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడడంతో మార్కండ నదిపై నిర్మించిన తాత్కాలిక చెక్క వంతెన కొట్టుకుపోయింది. ఈనేపథ్యంలో గురువారం యాత్ర నిలిపివేశారు. దీంతో దాదాపు 50 మంది యాత్రికులు, స్థానికులు 11,473 అడుగుల ఎత్తులో కురుస్తుండడంతో వాతావరణశాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. గతేడాది కూడా ఈ ఆలయానికి వెళ్లే మార్గంలోని ఓ వంతెన కూలిపోయింది.

# కేంద్రంలో రాజీరాజకీయాల్లో జగన్, కెసిఆర్


**చక్రం తిప్పే అవకాశం తప్పడంతో కొత్త ఎత్తులు**
**బిజెపికి చేరువగా బిఆర్ఎస్, కాంగ్రెస్ దగ్గరకు జగన్**
**మారుతున్న రాజకీయ సమీకరణాలు**

న్యూఢిల్లీ,జూలై26 :కేంద్రంలో మూడోమారు అధికారం దక్కించుకున్న బిజెపి రాజకీయ దోబూచు లాడుతోంది. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, వైకాపాలతో లోపాయకారి ఒప్పందాలు చేసుకుంటున్నట్లు వార్తలు గుప్పుమంటున్నాయి. బిఆర్ఎస్‌కు రాజ్యసభలో నలుగురు ఎంపిలు ఉన్నారు. రాజ్యసభలో బిజెపికి బలం లేదు. అందువల్ల వీరిని చేర్చుకుంటారన్న ప్రచారం ఉంది. అలాగే లోక్‌సభలో కూడా బిజెపికి సంపూర్ణ మెజార్టీ లేదు. అందువల్ల రానున్న కాలంలో అక్కడా బలం పెంచుకునే ప్రయత్నంలో ఉంది. ఇప్పుడు వైకాపాకు చెందిన ఎంపిలు నలుగురు బిజెపిలోకి వెళతారన్న ప్రచారం కూడా సాగుతోంది. ఇరు పార్టీలకు ఇది అవసరం కనుక అలా జరగవచ్చు. ఈ క్రమంలోనే ఈ రెండు ప్రాంతీయ పార్టీల నేతు కూడా తమకు ఏది మేలో అన్న ఆలోచనలో సాగుతున్నారు. జగన్ ఢిల్లీ ధర్నాతో కాంగ్రెస్‌కు దగ్గర కావాలని చూస్తున్నట్లుగా ఉంది. తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో అనూహ్యమైన మార్పు కనిపిస్తోంది. అధికారంలో ఉండగా ఈ రెండు పార్టీలు కలసి నడిచారని అందరికీ తెలుసు. బీఆర్ఎస్, వైసీపీకి వచ్చే ఎంపి సీట్లతో ఢిల్లీలో చక్రం తిప్పవచ్చని రెండు పార్టీల నేతలు అనుకున్నారు. గతంలో ఈ విషయాన్ని బహిరంగంగానే ప్రకటించారు. ఏపీకి ప్రత్యేకహోదా కోసం పోరాడతానని కేసీఆర్ కూడా చెప్పారు. అయితే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలకు దెబ్బ తగిలింది. ఢిల్లీ రాజకీయ పరిణామాలు వీరి పార్టీలకు ఎప్పుడూ అనుకూలంగా మారలేదు. దీంతో అవకాశం కోసం ఎదురు చూస్తూ వచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్ గెలుపు కోసం వైసీపీ నేతలు గట్టిగానే ప్రయత్నించారు. కానీ ప్రయోజనం లేకపోయింది. ఏపీలో వైసీపీ గెలుస్తుందని తమకు సమాచారం ఉందని కెసిఆర్, కెటిఆర్‌లు పదే పదే ప్రచారం చేసినా ..వైసీపీకి కాలం కలసి రాలేదు. దీంతో జాతీయ రాజకీయల్లో వీరికి పాత్రేమీ లేకుండా పోయింది. బీఆర్ఎస్, వైసీపీలకు ఇప్పుడు తమకో అండ ఉండాలని జాతీయ స్థాయిలో ఎవరి రాజకీయాలు వారు చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. బీఆర్ఎస్ అని వార్యంగా బీజేపీకి దగ్గరవుతోంది. అంతే అనివార్యంగా కాంగ్రెస్‌కు జగన్ దగ్గరవుతున్నారు. బీజేపీ నుంచి తన పార్టీకి పొంచి ఉన్న పెనుముప్పు నుంచి తప్పించుకునేందుకు, కవితను జైలు నుంచి బయటకు తెచ్చేందుకు బీఆర్ఎస్ కు మరో మార్గం కనిపించడం లేదని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. అందుకే బీజేపీతో విలీన ఫార్ములాపై చర్చించి వచ్చారని విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. అందులో భాగంగానే బీజేపీపై విమర్శలు చేయడం లేదని రాజకీయ పండితులు విశ్లేషిస్తున్నారు

# సినిమా తీరు

# "క" మూవీ.. బెస్ట్ థియాట్రికల్ డీల్

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం కొంత గ్యాప్ తీసుకొని ఈ సారి పాన్ ఇండియా లెవల్ లో సక్సెస్ కొట్టడానికి "క" అనే మూవీతో రావడానికి రెడీ అవుతున్నాడు. పీరియాడికల్ జోనర్ లో డిఫరెంట్ కథాంశంతో ఈ మూవీ తెరకెక్కుతోంది. సుజిత్, సందీప్ ఈ చిత్రంతో దర్శకులుగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీలో కిరణ్ అబ్బవరం పోస్ట్ మెన్ క్యారెక్టర్ లో కనిపిస్తున్నాడు. టైం ట్రావెల్ బ్యాక్ డ్రాప్ లో "క" మూవీ కథ ఉండబోతోందని




తాజాగా వచ్చిన టీజర్ తో స్పష్టం అవుతోంది ఇదిలా ఉంటే ఈ మూవీ టీజర్ తోనే పబ్లిక్ లో అటెన్షన్ క్రియేట్ చేశారు. మూవీలో ఏదో విషయం ఉందని అర్ధమవుతోంది. కిరణ్ అబ్బవరం క్యారెక్టర్ కూడా చాలా మిస్టీరియస్ గా కనిపిస్తోంది. దీంతో ఈ సినిమాపై ఎక్స్ పెక్టేషన్స్ పెరిగాయి. ఒక్క టీజర్ తోనే మూవీ బిజినెస్ డీల్స్ ఆల్ మోస్ట్ క్లోజ్ అయిపోయినట్లు తెలుస్తోంది. కచ్చితంగా ఈ సినిమాతో బ్లాక్ బస్టర్ కొడతాననే నమ్మకంతో కిరణ్ అబ్బవరం ఉన్నారు. ఈ మూవీ కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ థియాట్రికల్ రైట్స్ ని వంశీ నందపాటి సొంతం చేసుకున్నారు. పొలిమేర 3 చిత్రంతో ఈయన నిర్మాతగా మారబోతున్నారు. ఇక "క" మూవీ హక్కులని రెండు రాష్ట్రాలకి కలిపి 12 కోట్లకి వంశీ నందపాటి సొంతం చేసుకున్నట్లు తెలుస్తోంది. అంటే కిరణ్ అబ్బవరం మార్కెట్ తో పోల్చుకుంటే ఎక్కువ మొత్తానికే "క" మూవీ రైట్స్ అమ్ముడైనట్లు తెలుస్తోంది.ఈ చిత్రాన్ని శ్రీచక్రాస్ ఎంటర్టైన్మెంట్స్, కెఏ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి.కిరణ్ అబ్బవరం మూవీతో నిర్మాతగా మారబోతున్నాడు. ఈ సినిమాకి సామ్ సిఎస్ సంగీతం అందించారు. కంప్లీట్ గా విలేజ్ బ్యాక్ డ్రాప్ లో ఈ మూవీ కథ ఉంటుందని తెలుస్తోంది. కచ్చితంగా "క" సినిమా కిరణ్ అబ్బవరం కెరియర్ లో మైల్ స్టోన్ గా నిలిచిపోతుందని ఈ సినిమాకి జరుగుతున్న బిజినెస్ చూస్తుంటే అర్ధమవుతోంది. ఈ ఏడాదిలోనే మూవీ ప్రేక్షకుల ముందుకి రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. రిలీజ్ డేట్ ఎప్పుడు ఎనౌన్స్ చేస్తారు అనేది వేచి చూడాలి. నాన్ థియాట్రికల్ రైట్స్ కూడా ఫ్యాన్సీ ధరకి అమ్ముడైనట్లు టాక్ వినిపిస్తోంది. యూనివర్సల్ గా ఇలాంటి మిస్టీరియస్ థ్రిల్లర్ కథలకి మంచి డిమాండ్ ఉంటుంది. ఈ నేపథ్యంలో కిరణ్ కూడా పాన్ ఇండియా లెవల్ లో సక్సెస్ అందుకునే ఛాన్స్ ఉందని సినీ విశ్లేషకులు అంటున్నారు.

# 'డబుల్ ఇస్మార్ట్' కి అక్కడ సవాల్ తప్పదా?



డ్యాషింగ్ డైరెక్టర్ పూరిజగన్నాథ్ పాన్ ఇండియా సినిమా కల ఇంకా నెరవేరని సంగతి తెలిసిందే. తొలి ప్రయత్నం'లైగర్' భారీ అంచనాల మధ్య చేసినా అది దారుణమైన ఫలితాన్ని చూసింది. ఆ సినిమా కంటే హిందీలో'ఇస్మార్ట్ శంకర్' బెటర్ టాక్ తో నడిచింది. దీంతో ఆ సినిమాకి సీక్వెల్ గా తెరకెక్కిస్తోన్న'డబుల్ ఇస్మార్ట్' ని కూడా నార్త్ రీజియన్ లో భారీ ఎత్తున రిలీజ్ ప్లాన్ చేస్తున్నారుదీనిలో భాగంగా బాలీవుడ్ నుంచి సంజయ్ దత్ ని సైతం రంగంలోకి దించి విలన్ బాధ్యతలు అప్పగించాడు. అతడి ఎంట్రీ సినిమాకి అమాంతం మంచి హైప్ తీసుకొచ్చింది. రామ్ ఎనర్జీకి దత్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రచ్చ తప్పదనే అంచనాల్లో యూనిట్ కనిపిస్తోంది. ఇక సినిమా ఎట్టకేలకు అన్ని పనులు పూర్తిచేసుకుని ఆగస్టు 15న రిలీజ్ చేస్తున్న సంగతి తెలిసిందే. సినిమాకి టాక్ బాగుంటే తిరుగుండదు. ఆ రోజు తెలుగు నుంచి పెద్దగా రిలీజ్ లేవు. ఉన్న సినిమాలు కూడా పెద్దగా పోటీలో లేనివే. అయితే తంగలాన్ మాత్రం కాస్త పోటీనివ్వొచ్చు. కానీ అది డబ్బింగ్ సినిమా కాబట్టి తెలుగు సినిమా తర్వాతే సెకెండ్ ఆప్షన్ గా ఉంటుంది. అయితే బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద మాత్రం డబుల్ ఇస్మార్ట్ కి సవాల్ తప్పేలా లేదు. ఈ సినిమాతో పాటు పోటీగా మరో మూడు భారీ బడ్జెట్ సినిమాలు రిలీజ్ అవుతున్నాయి. వరుసగా పబ్లిక్ హాలీడేలు రావడంతో డేట్ ని ముందే లాక్ చేసుకున్నాయి. శ్రద్దాకపూర్, రాజ్ కుమార్ రావు నటించిన'స్త్రీ-2' రిలీజ్ అవుతుంది. ఈ సినిమాపై భారీ అంచనాలున్నాయి. ఇప్పటికే రిలీజ్ అయిన ప్రచార చిత్రాలకు మంచి హైప్ వచ్చింది. పైగా హిట్ సినిమాకి సీక్వెల్ కావడంతో మరింత అంచనాలతో రిలీజ్ అవుతుంది. అలాగే అక్షయ్ కుమార్, తాప్సీ నటిస్తోన్న'ఖేల్ ఖేల్ మే' కూడా అదే రోజు రిలీజ్ అవుతుంది. అక్షయ్ వరుస వైఫల్యాలు ఈ సినిమాపై ప్రభావం చూపే అవకాశం ఉన్నా తొలి షో అనంతరం టాక్ పాజిటివ్ గా వస్తే సీన్ మారిపోతుంది. అలాగే జాన్ అబ్రహం నటిస్తోన్న'వేదా' కూడా రిలీజ్ అవుతుంది. ఇప్పటివరకూ ఈ సినిమాపై ఎలాంటి బజ్ క్రియేట్ అవ్వలేదు. రిలీజ్ దగ్గర పడుతోన్న నేపథ్యంలో ఈ రెండు సినిమాల్ని ప్రత్యేకంగా ప్రమోషన్ ప్లాన్ చేస్తున్నారు. మరి వీటన్నింటి మధ్యలో డబుల్ ఇస్మార్ట్ ఎలాంటి హిట్ సాధిస్తుందన్నది చూడాలి.

# ఫ్రిడ్జ్‌లో ఉంచిన పిండితో చపాతీ తింటే ఆరోగ్యానికి హానికరం.



ఈ బిజీ జీవనశైలిలో ఈరోజు అందరూ ఇంట్లో పనికి వెళతారు. అందువల్ల, మహిళలు ఉదయం హడావిడిగా ఉంటారు. కొందరికి అల్పాహారం కావాలి, పిల్లలు స్కూల్స్ కు పంపడానికి, ఆఫీసుకు వెళ్లాలనే తొందరలో ఉంటారు. ఉద్యోగం చేసే మహిళలకు ఇది ఒక పెద్ద టాస్క్ అలాంటప్పుడు, టైమ్ మేనేజ్‌మెంట్‌గా, ఆమె ఉదయం తొందరపడకుండా రాత్రి సమయంలోనే ఉదయం అల్పాహారం కోసం ఏం చేయాలో సిద్దం చేసి పెట్టుకుంటుంది. చాలా మంది బద్ధకం వల్లనో, సమయాభావం వల్లనో చపాతీ పిండిని కలిపి ఫ్రిజ్ లో పెట్టుకుని చపాతీలు చేసుకుని తింటారు. ఇలా ముందుగానే పిండిని సిద్దంగా ఉంచుకోవడం వల్ల ఉదయాన్నే వేడి వేడి చపాతీలు త్వరగా సులభంగా చేసుకోవచ్చు మరియు హడావిడి ఉండదని భావిస్తారు. కానీ మీ ఈ అలవాటు మీకు మరియు మీ కుటుంబ సభ్యులకు ఎంతమాత్రం ఆరోగ్యకరమైనది కాదు. అరకొరగా ఉన్న ఈ జీవితంలో మీరు ఆరోగ్యంతో ఆడుకుంటున్నారు. రాత్రి సిద్దం చేసి ఫ్రిజ్‌లో ఉంచిన పిండి వల్ల ఆరోగ్యానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని నిపుణులు చెబుతున్నారు. దాని దుష్ప్రభావాలు ఏమిటో ఖచ్చితంగా తెలుసుకుందాం. జులై 31 లోపు ఏకాదశిలో సింహరాశి వారికి జరగబోయేది ఇదే.. ముందే తెలుసుకోండి..!! పిండిని ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల మీ ఆరోగ్యానికి హానికరం, ఇది మీ శరీరంపై స్లో పాయిజన్‌గా పని చేస్తుందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా ఫ్రిజ్ నుండి పిండిని వాడటం ఆరోగ్యానికి హానికరం అని ఆయుర్వేదంలో చెప్పబడింది. ఎప్పుడో ఒకసారి కాల్చిన చపాతి ఆలస్యంగా తింటే ఎలాంటి ఇబ్బంది ఉండదు. కానీ నిపుణుల అభిప్రాయం ప్రకారం, చపాతీ పిండిని ముందే కలిపి పెట్టుకుని ఉదయం తినడం సరైన పద్ధతికాదు, చపాతీ పిండిని ఎప్పటికప్పుడు ఫ్రెష్ గా కలుపుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, పిండిని ఎక్కువసేపు ఫ్రిజ్‌లో ఉంచితే, అవసరమైన అన్ని పోషకాలు అదృశ్యమవుతాయి. అందువల్ల, పొట్ట నొప్పి మరియు వాపు కాకుండా, ఎసిడిటీ సమస్య కూడా అనుభూతి చెందుతారు. వేదాలలో చెప్పబడినట్లుగా, అటువంటి మిగిలి ఆహారాన్ని లేదా చద్దిపడిన ఆహారాన్ని తినే వ్యక్తి ఎల్లప్పుడూ వివిధ వ్యాధుల బారిన పడతాడని చెప్పబడింది. పారిస్ ఒలింపిక్స్ గేమ్స్ ఫుడ్ మెనూలో వెజ్ బిర్యానీ నుంచి బటర్ చికెన్ వరకు! ఆరాధన శర్మ ఇది ఆరోగ్యానికి ఎలా హానికరం? ఇలా పిండిని ముందే రెడీ చేసి, ఉదయం చపాతీలు చేసి తినడం వల్ల కడుపులో గ్యాస్ మరియు ఆమ్లతను ఆహ్వానిస్తారు. మీకు మలబద్ధకం సమస్య పెరుగుతుంది. మీరు కీళ్ల నొప్పులు మరియు వెన్నునొప్పితో బాధపడతారు. హార్ట్ బ్లాక్ సమస్య కూడా రావచ్చు. ఇది చిన్న పిల్లల జ్ఞాపకశక్తిని కూడా ప్రభావితం చేస్తుంది. ఫ్రిజ్‌లో ఉంచిన పిండి చపాతీలు పిల్లల నుండి వృద్ధుల వరకు అందరికీ హానికరం. ఊపిరితిత్తులు, కిడ్నీ సమస్యలు కూడా వస్తాయని హెచ్చరిస్తున్నారు. ఇది రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తుంది, కాబట్టి ఫ్రిజ్ నుండి పిండితో తయారుచేసిన చపాతీలను తినడం మానేయండి. గట్ ఆరోగ్యం ప్రతికూలంగా ప్రభావితం కావచ్చు మీరు రిఫ్రిజిరేటర్‌లో ఉంచిన పిండి నుండి రోటీని కూడా తయారు చేస్తే, మీ ప్రేగు ఆరోగ్యం ప్రతికూలంగా ప్రభావితమవుతుంది. మీరు ఈ పద్ధతిని అనుసరిస్తే, మీరు గ్యాస్ మరియు ఎసిడిటీ వంటి కడుపు సంబంధిత సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది. అంతే కాకుండా, పిండిని రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం వల్ల కూడా అందులో ఫంగస్ వృద్ధి చెందుతుంది,అంతేకాకుండా, మెత్తగా పిండిని ఫ్రిజ్‌లో ఎక్కువసేపు ఉంచడం వల్ల కర్నాటక స్టైల్లో గిర్మిట్‌ను ఇలా చేసుకొని చాయ్‌తో తింటే..ఆహా..!! బాక్టీరియా పెరగవచ్చు పిండిని ఎక్కువసేపు రిఫ్రిజిరేటర్‌లో ఉంచడం వల్ల అందులో బ్యాక్టీరియా వృద్ధి చెందే అవకాశాలు పెరుగుతాయి. అంతే కాకుండా ఫ్రిజ్‌లో ఉంచిన పిండితో చేసిన రోటీల రుచి కంటే తాజా పిండితో చేసిన రోటీల రుచి చాలా రెట్లు బాగుంటుంది. మీరు కూడా మీ ఆరోగ్యాన్ని దృఢంగా ఉంచుకోవాలనుకుంటే, ముందుగానే పిండిని కలిపి పెట్టడం తాజా పిండితో చేసిన రోటీలను చేర్చుకోవాలి.

# డిజాస్టర్ మూవీకి 100+ మిలియన్ వ్యూస్!

తెలుగు సినిమాలకు నార్త్ లో మంచి క్రేజ్ ఉంటుందనే సంగతి తెలిసిందే. ముఖ్యంగా మన మాస్ చిత్రాలకు అక్కడ మంచి ఆదరణ దక్కుతుంది. ఇక్కడి ఫ్లాప్ చిత్రాలను, బాక్సాఫీస్ దగ్గర ఫెయిల్ అయిన సినిమాలను హిందీలోకి డబ్బింగ్ చేసి యుట్యూబ్ లో రిలీజ్ చేస్తే.. మిలియన్ల కొలదీ వ్యూస్ సాధిస్తుంటాయి. ఇప్పుడు ఇదంతా ఎందుకంటే టాలీవుడ్ లో డిజాస్టర్ గా మారిన ఓ మూవీ ఇప్పుడు హిందీలో ఊహించని విధంగా మిలియన్ వ్యూస్, లైక్స్ తో దూసుకుపోతోంది. ఆ సినిమా మరేదో కాదు "స్కంద: ది ఎటాకర్". ఉస్తాద్ రామ్ పోతినేని హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'స్కంద: ది ఎటాకర్'. 2023 సెప్టెంబర్ నెలాఖరున తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో రిలీజయింది. భారీ అంచనాలతో విడుదలైన ఈ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్.. ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేదు. దాదాపు 90 కోట్లకు పైగా బడ్జెట్ పెట్టి తీస్తే, బాక్సాఫీస్ వద్ద 60 కోట్లు కలెక్షన్లు కూడా రాబట్టలేకపోవడంతో ట్రేడ్ వర్గాలు డిజాస్టర్ అని తేల్చేశాయి. నార్త్ లోనూ పెద్దగా ప్రభావం చూపలేదు. ఓటీటీలో ట్రోలింగ్ ఎదుర్కొన్న ఈ సినిమా.. టీవీల్లో మాత్రం మంచి టీఆర్పీ రేటింగ్స్ అందుకుంది. ఈ క్రమంలో హిందీ వెర్షన్ యూట్యూబ్ ను షేక్ చేస్తోంది. 'స్కంద' మూవీ హిందీ డబ్బింగ్ వెర్షన్ ను ఇటీవలే యూట్యూబ్ లో అప్లోడ్ చేసారు. దీనికి ఆడియన్స్ నుంచి అనూహ్య రెస్పాన్స్ వచ్చింది. నెల రోజుల్లోనే 100 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించింది. అంతేకాదు 1.1 మిలియన్ కు పైగా లైక్స్ రాబట్టింది. థియేటర్లలో ఫ్లాప్ అయిన సినిమాకి ఇంత తక్కువ కాలంలో ఈ రేంజ్ లో వ్యూస్, లైక్స్ రావడం మామూలు విషయం కాదు. ఇది రామ్ - బోయపాటిల మాసివ్ కాంబోకి హిందీలో ఎంత క్రేజ్ ఉందనే విషయాన్ని గుర్తు చేస్తోంది.

## అందానికే మరో అందం....







# శాంసన్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. ఇకపై భారత జట్టులో చోటు పక్కా.. ఇదిగో సాక్ష్యం..



కొత్త ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో, శ్రీలంక సిరీస్ కోసం టీమ్ ఇండియా సిద్ధమవుతోంది. ఈ క్రమంలో టీమ్ ఇండియా శిక్షణా సెషన్ వీడియో ఒకటి బయటకు వచ్చింది.ఇందులో గౌతమ్ గంభీర్ ఆటగాళ్లను నిశితంగా గమనిస్తూ వారికి అవసరమైన సలహాలు ఇస్తున్నాడు. ఇంతలో, ఒక విషయం అందరి దృష్టిని ఆకర్షించింది. గౌతమ్ గంభీర్ ప్రముఖ బ్యాట్స్‌మెన్ సంజూ శాంసన్‌తో చాలా సేపు మాట్లాడాడు. శిక్షణ సమయంలో గౌతమ్ గంభీర్ శాంసన్‌తో మాట్లాడుతున్న తీరు చూస్తుంటే పలు ఊహాగానాలు వస్తున్నాయి.సంజూ శాంసన్ గురించి చెప్పాలంటే, అతను జట్టులో చోటు దక్కించుకున్నా.. బెంచ్‌కే పరిమితం అవుతున్నాడు. అతనికి ఎప్పుడూ జట్టులో సాధారణ స్థానం లభించలేదు. అతను ౹20 ప్రపంచ కప్‌నకు ఎంపికయ్యాడు. కానీ, మొత్తం టోర్నమెంట్‌లో అతనికి ఒక్క మ్యాచ్ కూడా ఆడే అవకాశం రాలేదు. అందుకే ఈ విషయంపై చాలా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే, ఇప్పుడు గౌతమ్ గంభీర్ కోచింగ్‌లో సంజూ శాంసన్‌కు రెగ్యులర్ అవకాశాలు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.కొత్త కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలో టీమ్ ఇండియా ట్రైనింగ్ సెషన్ కోసం రంగంలోకి దిగినప్పుడు, గౌతమ్ గంభీర్ సంజూ శాంసన్‌తో వన్ టు వన్ మాట్లాడాడు. దీన్ని బట్టి ఇప్పుడు టీమ్ ఇండియాలో సంజూ శాంసన్‌కి మంచి రోజులు మొదలయ్యాయని, అతనికి నిరంతరం ఆడే అవకాశం లభించవచ్చని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. గౌతమ్ గంభీర్ ఎల్లప్పుడూ సంజూ శాంసన్‌కు చాలా మద్దతునిచ్చాడు. ఇప్పుడు ప్రధాన కోచ్ అయిన తర్వాత, శాంసన్ మ్యాచ్‌లలో ఆడటం చూడవచ్చు. అయితే, దీని కోసం శాంసన్ మెరుగైన ప్రదర్శనను కొనసాగించాల్సి ఉంటుంది.గౌతమ్ గంభీర్ తన మొదటి విలేకరుల సమావేశంలో ఆటగాళ్లకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు. గంభీర్ ప్రకారం, అతను కోచ్, ప్లేయర్ మధ్య సంబంధాన్ని కోరుకోవడం లేదు. బదులుగా ప్రతి ఒక్కరూ ఒకరినొకరు విశ్వసించాలని, ఎల్లప్పుడూ ఆటగాళ్లకు తన పూర్తి మద్దతునిస్తాడని ఆశిస్తున్నాడు.

# తొలి టీ20లో టీమిండియా ప్లేయింగ్ 11 ఇదే.. బెంచ్‌కే సిక్సర్ల ప్లేయర్.. మరో ఇద్దరు ఔట్

భారత్ ? శ్రీలంక మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో మొదటి మ్యాచ్ జులై 27 నుంచి జరగనుంది. ఈ సిరీస్ ప్రారంభానికి ముందు, టీమ్ ఇండియా ప్లేయింగ్ ఎలెవన్ గురించి చాలా ఊహాగానాలు మొదలయ్యాయి.జింబాబ్వే పర్యటనకు వెళ్లిన కొందరు ఆటగాళ్లను కూడా ఈ సిరీస్‌కు ఎంపిక చేశారు. టీ20 ప్రపంచకప్‌లో ఆడిన కొందరు ఆటగాళ్లు కూడా జట్టులో చోటు దక్కించుకున్నారు. ఈ కారణంగానే ప్లేయింగ్ లెవెన్ విషయంలో ఎవరికి అవకాశం దక్కుతుందో, ఎవరికి మొండిచేయి చూపిస్తారోనని అయోమయం నెలకొంది.ఓపెనింగ్ గురించి మాట్లాడితే, శుభమాన్ గిల్, యశస్వి జైస్వాల్ ఇక్కడ ఆడవచ్చు. రుతురాజ్ గైక్వాడ్, అభిషేక్ శర్మ ఎంపిక కాలేదు. ఈ కారణంగా, ఓపెనింగ్ విషయంలో పెద్దగా ఇబ్బంది ఉండదు. వికెట్ కీపర్ బ్యాట్స్‌మెన్ రిషబ్ పంత్ మూడో స్థానంలో ఆడగలడు. టీ20 ప్రపంచకప్‌లోనూ అదే పాత్ర పోషించాడు. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ నాలుగో స్థానంలో ఆడవచ్చు.సంజూ శాంసన్ ఐదో స్థానంలోనూ, హార్దిక్ పాండ్యా ఆరో స్థానంలోనూ ఆడవచ్చు. ఆ తర్వాత శివమ్ దూబేని మరో ఆల్ రౌండర్‌గా కూడా ఉపయోగించవచ్చు. అతను హార్దిక్ పాండ్యాకు బ్యాకప్‌గా సిద్ధం అవుతున్నాడు. అందుకే అతను



ఆడగలడు. స్పిన్నర్లుగా వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్‌లకు అవకాశం ఇవ్వవచ్చు. ఒకవేళ ఆడించాలంటే సంజూ శాంసన్, శివమ్ దూబేలలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో రింకూ సింగ్ వేచి ఉండాల్సిందే. దీంతో పాటు రియాన్ పరాగ్, రవి బిష్ణోయ్, ఖలీల్ అహ్మద్ కూడా తొలి టీ20 మ్యాచ్‌కు దూరంగా ఉండాల్సి రావచ్చు.శ్రీలంకతో తొలి టీ20కి భారత్ ప్రాబబుల్ ప్లేయింగ్ 11: శుభమన్ గిల్, యశస్వి జైస్వాల్, రిషబ్ పంత్, సూర్యకుమార్ యాదవ్, సంజు శాంసన్, హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY BYAGAL SRINIVAS, PRINTED AT S.S. PRINTERS & FILE MAKERS, PUS ALAGALLY, JAWAHAR ROAD, Town & Dist.NIZAMABAD- 503001, TELANGANA STATE, PUBLISHED AT H.NO: 6-11-174/1, NAMDEVWADA, Town & Dist. NIZAMABAD, TELANGANA STATE - 503001.EDITOR: BYAGAL SRINIVAS.